# ప్రజాశక్తి

గురువారం 12 అక్టోబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

# డెల్టాకు నీటి ఎద్దడి

- వరి ఎదుగుదలకు గ్రహణం
- ప్రకాశం బ్యారేజి నుంచి పరిమాణాన్ని తగ్గించిన అధికారులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కృష్ణా పశ్చిమ డెల్టాకు సాగునీటి ఎద్దడి ఏర్పడింది. పులిచింతల నుంచి పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయకపోవడంతో వరి పైరుకు నీరందక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పులిచింతలలో 32.75 టీఎంసీల నీరు నిల్వ ఉండగా దిగువకు 3 వేల క్యూసెక్కులే విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వలకు నీటి విడుదల పరిమాణాన్ని గణనీయంగా తగ్గించారు. బుధవారం పశ్చిమ డెల్టా కాల్వలకు 3007 క్యూసెక్కులే విడుదల చేశారు. గతనెలలో ఐదు వేల క్యూసెక్కుల వరకు ఇచ్చారు.

డెల్టా ప్రాంతంలో వరిపైరు వివిధ దశల్లో ఉంది. ఎక్కువ ప్రాంతాల్లో పొట్టదశలో ఉండగా ఆలస్యంగా సాగు చేసిన ప్రాంతాల్లో ఎదుగుదల దశలో ఉంది. దీంతో ప్రస్తుతం నీటి అవసరం పెరిగింది. 10 రోజులుగా వర్షాల్లేవు. వేడిగాలులు పెరిగాయి. అక్టోబరులో ఇప్పటి వరకు వర్షపాతం ఆశాజనకంగా లేదు. ఈనెలలో 129.4 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటివరకు 14.5 మిల్లీ మీటర్లే నమోదైంది. అన్ని కాల్వలకూ కలిపి కనీసం ఆరువేల క్యూసెక్కుల నిరివ్వాల్సి ఉండగా 3 వేల క్యూసెక్కులే ఇస్తున్నారని రైతులు చెబుతున్నారు. ప్రకాశం బ్యారేజికి ఎగువ నుంచి 7,095 క్యూసెక్కులు వస్తోంది. పట్టిసీమ, పులిచింతల వస్తున్న 7,095 క్యూసెక్కుల్లో తూర్పు, పశ్చిమ డెల్టాలకు కలిపి 6,079 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

తెనాలి, పెదనందిపాడు మండలాల్లో నీటి ఎద్దడి ఎక్కువగా ఉందని, కృష్ణా డెల్టాలో నీరు సరిపడా లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని, కనీసం నెలరోజుల పాటు నీటి అవసరం ఉందని రైతులు తెలిపారు. తెనాలి, వేమూరు నియోజకవర్గాల్లో కాల్వల్లో నీరు సరిగా విడుదల చేయని కారణంగా పంటలు ఎండిపోతున్నాయని రైతులు బుధవారం నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, నక్కా ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో రైతులు అధికారుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. నీటి

2లో

## సాగునీటిపై ఆశలు పెట్టుకోవద్దు : మంత్రి రాంబాబు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

నాగార్జున సాగర్ ఆయకట్టు కింద ఈ ఏడాది పంటలకు నీరిచ్చే పరిస్థితి లేదని, సాగునీటిపై ఆశలు పెట్టుకోవద్దని జల వనరుల శాఖామంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చాగల్లులో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి వచ్చిన మంత్రిని రైతులు కలిసి సాగునీరు ఇవ్వాలని కోరారు. మంత్రి స్పందిస్తూ సాగర్‌లో ఆశించిన మేర నీటి నిల్వలు లేవన్నారు. ప్రస్తుతం సాగర్ కాల్వకు విడుదల చేస్తున్న 5 టీఎంసీలు తాగునీటి అవసరాలకే వాడుకోవాలని చెప్పారు. ఈ ఏడాది వర్షాధారమే తప్ప సాగర్ కాల్వల కింద పంటలు సాగు చేసుకునే పరిస్థితి లేదన్నారు. నీరు మనం సృష్టించేది కాదని, దొరికితే కొనుక్కొచ్చి ఇవ్వటం సులువు కాదని మంత్రి వ్యాఖ్యానించారు.

## పొలానికి నీరు పెడుతుండగా విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి - అచ్చంపేట

మిర్చి పొలానికి నీరు పెడుతూ విద్యుత్‌షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని చిగురుపాడులో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మద్రి గంగయ్య (52) తన సొంత పొలంతోపాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేశాడు. పైరుకు నీరు పెట్టేందుకు ఉదయాన్నే పొలానికి వెళ్లిన గంగయ్య మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసి వెళ్లాడు. మోటారు స్విచ్‌ను ఆన్ చేస్తుండగా షాక్ రావడంతో పెద్దగా అరుస్తూ కుప్పకూలాడు. గమనించిన పక్క పొలంలోని రైతులు వచ్చి పరిశీలించగా గంగయ్య అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ధర్నాలో పాల్గొన్న యానిమేటర్లు

## యానిమేటర్లకు కాలపరిమితి జిఒ రద్దు చేయాలి

**కలెక్టరేట్ ఎదుట రెండో రోజూ కొనసాగిన ధర్నా - అధికార్లకు వినతులు**

ప్రజాశక్తి-గుంటూరు

తమ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ఎదుట యానిమేటర్లు చేపట్టిన ధర్నా రెండోరోజైన బుధవారమూ కొనసాగింది. కార్యక్రమానికి యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షులు దెబొరా అధ్యక్షత వహించగా గౌరవాధ్యక్షులు డి.లక్ష్మినారాయణ మాట్లాడుతూ మూడేళ్ల కాలపరిమితి, 45 ఏళ్ల వయోపరిమితి సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మింగ్, నాన్ ఫార్మింగ్ పేరుతో టార్గెట్స్ పెట్టి వేధించే విధానాన్ని అధికారులు మానుకోవాలని కోరారు. అద్దె ఇళ్లల్లో, చిన్న ఇళ్లలో ఉండే డ్వాక్రా మహిళలు గేదెలను, గొర్రెలను, కోళ్లను, మేకలను ఏ విధంగా పెంచాలని ప్రశ్నించారు. యానిమేటర్లకు ఇస్తున్న వేతనాన్ని వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ

2లో

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గరల్స్ కో-కన్వీనర్ కె.నవిత

## అక్కా.. హీనంగా చూస్తున్నారు..

- ఎస్ఎఫ్ఐ నాయకుల ఎదుట ఎస్సీ హాస్టల్ విద్యార్థినుల ఆవేదన
- అన్నం సరిగా పెట్టడం లేదని, పాలల్లో నీళ్లే ఎక్కువని సమస్యల ఏకరువు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇరుకు గదుల్లో 70 మందిని కుక్కారని, కనీస సదుపాయాలు కూడా కల్పించలేదని, మెనూ ప్రకారం భోజనమైనా పెట్టకుండా హీనంగా చూస్తున్నారని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకుల ఎదుట విద్యార్థినులు వాపోయారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేటలోని ఎస్సీ బాలిక హాస్టల్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తామెదుర్కొంటున్న సమస్యలను నాయకుల ఎదుట ఏకరువుపెట్టారు. హాస్టల్‌ను అద్దె భవనంలో

2లో

## 50 ఏళ్లుగా ఉంటున్నాం.. పట్టాలివ్వండి..

- పింఛన్లు ఆపేశారు.. చెత్తపన్నును చెల్లించలేకపోతున్నాం..
- సిపిఎం పాదయాత్ర బృందం ఎదుట ప్రజల ఆవేదన
- ప్రజాచైతన్య యాత్రకు అడుగడుగునా ఘనస్వాగతం
- సమస్యలపై వినతులు
- 16న మహాధర్నాకు తరలిరావాలని నాయకుల పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి

కొండ పోరంబాకు స్థలంలో 50 ఏళ్లుగా ఇళ్లేసుకుని నివాసం ఉంటున్న వారికి డి ఫారెస్ట్ చేసి ఇళ్ల పట్టాలివ్వాలని పేదలు కోరారు. ఈ మేరకు సిపిఎం పాదయాత్ర బృందానికి అర్జీలిచ్చారు. మంగళగిరి నియోజకవర్గంలో సిపిఎం చేపట్టిన ప్రజాచైతన్య పాదయాత్ర బుధవారం మంగళగిరి పట్టణంలోని 1వ వార్డు నుండి 7వ వార్డు వరకు సిపిఎం కొనసాగింది. ప్రజలు తామెదుర్కొంటున్న పలు సమస్యలను నాయకులకు వివరించి వినతి పత్రాలు ఇచ్చారు. తమకు అటవీశాఖాధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారని, రిజిస్ట్రేషన్లను కూడా నిలిపేశారని, బ్యాంకు రుణాలూ ఇవ్వడం లేదని కొండపోరంబోకు భూమి నివాసితులు వాపోయారు. కార్పొరేషన్ విధించిన చెత్తపన్ను తమకు ఆర్థికంగా భారంగా ఉందని, దీన్ని రద్దు చేయాలని అన్నారు. అనేక కారణాలతో పెన్షన్లను రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని, దేవస్థానం భూమిలో ఎన్నో ఏళ్లుగా ఇళ్లేసుకుని నివాసముంటున్న పేదలకు

2లో

శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

## ఆరోగ్య వివరాలు కంప్యూర్లలో నిక్షిప్తం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. మండలంలోని లింగంగుంట్లలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ గత నెల 30వ తేదీ నుంచి నిర్వహిస్తున్న శిబిరాలద్వారా రూ.1.6 కోట్ల కుటుంబాలకు వైద్య సేవలు అందించామన్నారు. అవసరమైన వారికి పెద్దాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా వైద్యం చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

## 112 మంది విద్యార్థులకు సైకిళ్లు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

విడదల నిహారిక ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు 112 సైకిళ్లను అదాయపన్న శాఖ విశ్రాంత కమిషనర్ పివి రావు ద్వారా బుధవారం పంపిణీ చేశారు. స్థానిక శ్రీనివాసం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు విడదల సాంబశివరావు, కార్యదర్శి విడదల కమలేంద్ర మాట్లాడుతూ ఫౌండేషన్‌ను స్థాపించి 30 ఏళ్లయిన సందర్భంగా సైకిళ్ల పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. తానా సభ్యులైన విడదల సిఖేంద్రనాథ్ సౌజన్యంతో వీటిని సమకూర్చామన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ చైర్మన్ టి.రాజేంద్రప్రసాద్, మాజీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, ఎల్.ఆదినారాయణ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

**ప్రజాశక్తి - వినుకొండ :** బొల్లాపల్లి మండలం మేళ్లవాగు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి అనే వ్యక్తి ఒక షెడ్డులో బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో తనిఖీలు చరేసి పట్టుకున్నారు. నిందితుడు ఈ బియ్యాన్ని చుట్టుపక్కల గ్రామాల్లోని కార్డుదారుల నుండి కిలో రూ.11 చొప్పున కొని ఎక్కువ ధరకు ఫౌల్ట్రీ ఫారాలు, హోటళ్లకు విక్రయించేందుకు నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు. నిందితునిపై 6ఎ కేసుతోపాటు క్రిమినల్ కేసుల నమోదుకూ సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహశీల్దార్‌ను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాసులురెడ్డి, తహశీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

# 50 ఏళ్లుగా ఉంటున్నాం.. పట్టాలివ్వండి..

(మొదటి పేజీ తరువాయి)

పట్టాలివ్వాలని, 4వ వార్డు ఎస్టీ కాలనీలో పేదలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో ప్రజలు వినతిపత్రాలను పాదయాత్ర బృందానికి అందించారు.

ఈ సందర్భంగా పాతబస్టాండ్ సెంటర్లో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణలను రాష్ట్రంలో అమలు చేస్తున్న వైసిపి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తోందని విమర్శించారు. ఇసుక ధరలను పెంచి భవన నిర్మాణ రంగ కార్మికులకు పనులు లేకుండా చేశారని మండిపడ్డారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు మాట్లాడుతూ మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థగా ఏర్పడిన తర్వాత ప్రజలపై భారాలు మోపారేగాని అభివృద్ధి మాత్రం లేదన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా తమ దృష్టికి వచ్చిన సమస్యలపై 16వ తేదీన కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చేసే మహాధర్నాకు ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలోని పలుచోట్ల ఇళ్లేసుకుని జీవిస్తున్న పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు.

పాదయాత్రకు వివిధ ప్రాంతాల్లో ఘన స్వాగతం లభించింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, పొట్టి శ్రీరాములు, నిమ్మగడ్డ రామ్మోహనరావు, తుపాకుల సుబ్బారావు, విగ్రహాలకు నాయకులు పూలమాలలేసి నివాళు లర్పించారు. సిపిఎం జెండాలను జిల్లా కార్యదర్శితోపాటు తాడేపల్లి రూరల్ కార్యదర్శి డి.వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు జెవి రాఘవులు, ఎస్.గణేష్ ఆవిష్కరించారు.

నాయకులకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు.. ఆస్పత్రిలో బృందం పరిశీలన, నిమ్మగడ్డ రామ్మోహనరావు విగ్రహం నాయకుల వద్ద నివాళి

ప్రజానాట్య మండలి కళాకారులు విప్లవ గేయాలు, ప్రజా సమస్యలపై పాటలను ఆలపించారు. పాదయాత్ర బృందం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అక్కడ అందుతున్న వైద్యసేవలు, సదుపాయాలు, ఓపీ తదితర వివరాలను తెలుసుకుంది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, తాడేపల్లి పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు పి.బాలకృష్ణ, ఎం.బాలాజీ, టి.శ్రీరాములు, వివి జవహర్లాల్, కె.నాగేశ్వరరావు, డి.రామారావు, ఎస్.వెంకటేష్, ఎం.నాగేశ్వరరావు, కె.ఏడుకొండలు, కె.శ్రీనివాసరావు, టి.హేమసుందర్‌రావు, ఎస్.నరసింహారావు, ఎస్.గణేష్, ఎం.రాంబాబు, జె.నవీన్ ప్రకాష్, వి.వెంకటేశ్వరరావు, మేరమ్మ పాల్గొన్నారు.

## కిలో కందిపప్పు ఇవ్వలేని ప్రభుత్వం : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు, పేదలకు రేషన్, కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వడం లేదని, ఏ మోహం పెట్టుకుని బస్సు యాత్ర చేస్తారని వైసిపి ప్రభుత్వంపై మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. పట్టణంలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మేనిఫెస్టోలో 99 శాతం అమలు చేశామని మంత్రులు, వైసిపి నాయకులు చెబుతుంటారని, అసలు ఎన్ని హామీలిచ్చారు.. ఎన్ని అమలు చేశారు.. అనే విషయాలను ప్రజలకు చెప్పాలని అన్నారు. రేషన్ కార్డుదారులకు పండగపూట కిలో కందిపప్పు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని, రేషన్ వ్యవస్థనే అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. అడ్డగోలు ప్రచారాలకు రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నా పేదల ఆకలి తీర్చడానికి మాత్రం నిధుల్లేవా? అని ప్రశ్నించారు. వ్యవసాయాన్ని చంపేసి రైతును ముంచేశారని, సాగర్ ఎడమ కాల్వ ద్వారా తెలంగాణలో సాగు నీరు విడుదల చేసినా మన రాష్ట్రంలో మాత్రం విడుదల చేయకపోవడం చేతగానితనమేనన్నారు. కృష్ణా జలాల పరిరక్షణలో జగన్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని కోరారు.

# గులాబి పురుగు ఉధృతి పెరిగే అవకాశం

### పత్తి పొలాల్లో శాస్త్రవేత్త జి.రమేష్ పరిశీలన - నివారణకు పలు సూచనలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పత్తిలో గులాబీ పురుగు ఉందని, నివారణ కోసం రైతులు వెంటనే చర్యలు చేపట్టాలని డాట్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త జి.రమేష్ అన్నారు. మండలంలోని కావూరు, లింగంగుంట్ల, గంగన్నపాలెం తదితర గ్రామాల్లో పొలాలను ఆయన బుధవారం పరిశీలించారు. పైరు 60-90 రోజుల దశలో ఉన్న దృష్ట్యా ఈ నెల నుండి పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందని, పొలంలో ఎకరానికి 4-10 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ప్రిపినోపాస్ నాలుగు మిల్లీ లీటర్లు ఒక లీటర్ల నీటిలో, లేదా తయోడికార్బ్ 250 గ్రాములు 150 మిల్లీ లీటర్లను నీటిలో లేదా క్లోరోపైరిఫాస్ 500 మిల్లి లీటర్లు 150 నుంచి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారన్నారు. ఏడు రోజుల వ్యవధిలో రెండు లేదా మూడుసార్లు పిచికారి చేయాలని సూచించారు. వేప నూనెను ఒక ఎకరాకు ఒక లీటర్ పిచికారీ చేస్తే పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. ఎకరానికి మల్టీ కే అనే ద్రావణాన్ని 150-200 లీటర్ల నీటిలో కలిపి గాని, ఎకరానికి రెండు కిలోలు ఏదైనా ఒక ఎరువులో గాని, పురుగు మందులలో గాని కలిపి పిచికారి చేస్తే పూత, కాయలు నాణ్యత బాగా ఉంటుందని వివరించారు.

## అక్కా.. హీనంగా చూస్తున్నారు..

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారని, సరైన వసతుల్లేవని చెప్పారు. 70 మందికి 5 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని, హాస్టల్‌ను వారానికి ఒకసారే శుభ్రం చేయిస్తున్నారని తెలిపారు. హాస్టల్ పక్కనే వాటర్‌ప్లాంట్ ఉన్నా తమకు వాటిని ఇవ్వడం లేదని, 50 మిల్లీలీటర్ల పాలంటూ ఇస్తున్నా అందులో సగానికిపైగా నీళ్లే ఉంటున్నాయని, భోజనం కూడా మెనూ ప్రకారం పెట్టడం లేదని వాపోయారు. దీనిపై మాట్లాడదామన్నా హాస్టల్ వార్డెన్ అనారోగ్యం వల్ల సెలవులో ఉన్నారని అన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ గర్ల్స్ రాష్ట్ర కో-కన్వీనర్ కె.నవిత మాట్లాడుతూ విద్యార్థులు, చదువుల గురించి ఉపన్యాసాలు దంచే మంత్రులు, నాయకులు ఒక్కసారైనా క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనించాలని కోరారు. హాస్టళ్లలో పరిస్థితులు ఇంద దారుణంగా ఉంటే చదువుల మీద విద్యార్థులు ఎలా దృష్టి పెడతారని, వారి మానసిక ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో ఒక్కసారైనా ప్రభుత్వాలు అతోచించాయా? అని ప్రశ్నించారు. పేదలు చదువుకునే ఎస్సీ హాస్టళ్లలో పరిస్థితులను మెరుగుపర్చాలని, మౌలిక వసతులు కల్పించకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు త్వరలోనే నివేదిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు డి.అమూల్య, నాయకులు పాల్గొన్నారు.

## యానిమేటర్లకు కాలపరిమితి జిఒ రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని కోరారు. డ్వాక్రా మహిళలు నిర్వహించే మహిళా మార్టుల్లోనూ వారానికి రూ.10 వేలు కొనుగోలు చేయాలని యానిమేటర్లకు టార్గెట్స్ పెట్టడం సరికాదన్నారు. యానిమేటర్లందరికీ గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు శోభారాణి, ఆదిలక్ష్మి, పార్వతి, పద్మ, జ్యోతి తదితరులు మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 36 గంటల ధర్నా అనంతరం డిఆర్‌డిఎ పీడీకి, కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.శివాజీ, ముఠా వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దీప్తి మనోజ, కాంట్రాక్ట్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, జనసేన మహిళా విభాగం నాయకులు పార్వతి మద్దతు తెలిపారు.

## డెల్టాకు నీటి ఎద్దడి

(మొదటి పేజీ తరువాయి)

యాజమాన్యం, నిర్వహణ సరిగాలేదన్నారు. గుంటూరు జిల్లాలో 3.25 లక్షల ఎకరాలకుగాను 2.35 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగు చేశారు. ఇంకా 90 వేల ఎకరాల్లో ఏ పంటలూ వేయలేదు. 1.65 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా 1.40 లక్షల ఎకరాల్లో వరి వేశారు. 70 శాతం మంది రైతులు వెదపద్ధతిలో సాగు చేయగా 30 శాతం మంది సంప్రదాయ నాట్లు పద్ధతిలో సాగు చేశారు. జిల్లాలో 77 వేల ఎకరాల్లో పత్తిసాగు చేస్తారని అధికారులు ప్రకటించగా 44 వేల ఎకరాల్లోనే సాగైంది. 45 వేల ఎకరాల్లో మిర్చిసాగు చేయాల్సి ఉండగా 24 వేల ఎకరాల్లోనే సాగు చేశారు. 20 వేల ఎకరాల్లో ఇతర పంటలు వేశారు. ఇప్పటివరకు ఏ పంటలూ వేయని వారు రబీ సాగుకు సమాయత్తం అవుతున్నారు. ప్రధానంగా జొన్న, మొక్కజొన్న, మినుము,పెసర వేసేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు.

## డాక్టర్ సరికొండ రమాదేవికి మరో అవార్డు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తనపల్లికి చెందిన డాక్టర్ సరికొండ రమాదేవికి నార్త్ ఢిల్లీ కల్చర్ వారి జాతీయ అవార్డు-2023 లభించింది. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ఆమె అందుకోవడంతోపాటు సత్కారం పొందారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## వృద్ధాశ్రమంలో వృద్ధుడు మృతి

**ప్రజాశక్తి-గుంటూరు సిటి**

నగరంలోని ఓ వృద్ధాశ్రమంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం.హనుమంతరావు తెలిపిన వివరాల ప్రకారం నరసరావుపేటకు చెందిన బొడ్డుచెర్ల శ్రీధర్ (62) ను సంవత్సరం క్రితం సాయిబాబా రోడ్డు లోని స్వగహ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో తమ్ముడు అనిల్ కుమార్ చేర్పించాడు. మంగళవారం రాత్రి శ్రీనివాస్ నడుస్తూ కిందపడటంతో ఆయన తలకు గాయమైంది. దీంతో, శ్రీధర్‌ను ఓల్డ్ ఏజ్ హోమ్ సిబ్బంది జిజిహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీధర్ మంణించినట్లు ధ్రువీకరించారు. అనిల్ కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతి

**ప్రజాశక్తి-గుంటూరు సిటి**

జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ (55) చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కొత్తపేట ఎస్ఐ షేక్ ఎం.డి. మేరజ్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 7 న నాజ్ సెంటర్ లోని ప్రాథమిక ఆరోగ్య కే ంద్రం గేటు ఎదురుగా అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తుతెలి యని మహిళను, చుట్టుపక్కల వాళ్లు 108 ద్వారా జిజిహెచ్‌కు తరలించారు. చికిత్స తీసుకుంటూ మహిళ బుధవారం ఉదయం చనిపోయిందని, గుంటూరువారితోట 38వ సచివాలయ విఆర్ఒ అంగడి శాంతికుమారి ఇచ్చిన రిపోర్టు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసినవారు 8688831320, 8688831609, 0863-2221815 నంబర్లలో సంప్రదించాల్సింది కోరారు.

## బాధిత మహిళలకు డిఎస్‌పి పరామర్శ

**ప్రజాశక్తి - మేడికొండూరు**

మండలంలోని భీమినేనివారిపాలెంలో మంగళవారం ఒంటరిగా మహిళలు ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 160 గ్రాముల బంగారం, పది వేల నగదు అపహరించుకుపోయారు. చోరీ జరిగిన ఇంటిని, బాధిత మహిళలను తుళ్లూరు డి.ఎస్.పి పోతురాజు బుధవారం పరామర్శించారు.బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతుందని తెలి పారు. డీఎస్పీ వెంట మేడికొండూరు సిఐ కె.వాసు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఆప్ నాయకుడు మృతి

**ప్రజాశక్తి-రొంపిచర్ల**

వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న లోయలో పడిన ఘటనలో మండల కేంద్రమైన రొంపిచర్లలో బుధవారం జరిగింది. ఈ సంఘటనలో ఆప్ నాయకుడు మృతి చెందగా, అదే పార్టీకి చెందిన మరో ఇద్దరు నాయకులు, న్యాయవాదులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన న్యాయవాదులు ఎస్.మురళీకృష్ణ, సర్దార్, కారు యజమాని షేక్ ఉస్మాన్‌లు ఆమ్ ఆద్మీ పార్టీలో పనిచేస్తున్నారు. వీరు హైదరాబాదు నుండి నెల్లూరుకు కారులో వెళ్తున్నారు. వాహనాన్ని ఉస్మాన్ నడుపుతున్నారు. వేగంగా వెళ్తున్న కారు రొంపిచర్ల లోని తంగెడమల్లె మేజర్ కాలువ దాటగానే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న లోయలో పడింది.ఈ ఘటనలో తీవ్రగాయాల పాలైన ఉస్మాన్ (50) అక్కడికక్కడే మృతి చెందాడు. మురళీకృష్ణ, సర్దార్ లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. తీవ్ర గాయాలపాలైన వారిని 108 ద్వారా చికిత్సనిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు, బంధువులకు సమాచారం తెలియజేశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతుడు షేక్ ఉస్మాన్

## సీజ్ చేసిన వాహనాలకు వేలం

**ప్రజాశక్తి-అచ్చంపేట**

పట్టుబడ్డ వాహనాలకు అచ్చంపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాట ద్వారా ప్రభుత్వానికి రూ.5,18,679 ఆదాయం సమ కూరిందని ఎస్సై మణకృష్ణ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి సబ్ డివిజన్, అచ్చంపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది పలు కేసులలో సీజ్ చేసిన 13 మోటార్ సైకిళ్ళు, 3 కార్లు , ఒక ఆటోరిక్షాకు ఎస్‌డిపిఒ, సత్తెనపల్లి, పెదకూరపాడు సిఐ ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వం వారి అప్‌సెట్ వేల్యూ ప్రకారం 13 మోటార్ సైకిళ్ళు, 3 కార్లు , ఒక ఆటో ధర కలిసి రూ. 2,84,000 ఉన్నట్లు చెప్పారు. వాటిని వేలంపాట ద్వారా రూ. 5,18,679కు పాటదారులు దక్కించుకున్నట్లు వివరించారు.

## పేకాట స్థావరంపై దాడి

**ప్రజాశక్తి-కాకుమాను**

మండల పరిధిలోని పాండ్రాపాడు గ్రామ పరిధిలో బుధవారం పేకాట ఆడుతున్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 12,700 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ ఐ రవీంద్ర తెలిపారు.

## తెలంగాణ మద్యం పట్టివేత

**ప్రజాశక్తి - విజయపురిసౌత్**

మాచర్ల మండలం ఏకోనాంపేట వద్ద కృష్ణా నదిలో పుట్టి ద్వారా తెలంగాణ నుంచి ఏపీ లోకి అక్రమంగా తరలిస్తున్న 19 కేసుల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు మాచర్ల రూరల్ సీఐ షేక్ సమీముల్లా తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పుట్టిలో తెలం గాణ మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి చేరుకొని అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మద్యం విలువ రూ.1,20,000 ఉంటుందని అన్నారు. మద్యం తరలిస్తున్న సూదులు ఆంజనేయులు, దత్తు నాయక్ లను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. సిఐ వెంట విజయపురిసౌత్ ఎస్ఐ అనిల్ కుమార్ రెడ్డి,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## మిర్చి నిల్వలు

| | బ్యాగులు |
|---|---|
| మిర్చి దిగుమతి | : 31,729 |
| మిర్చి ఎగుమతి | : 30,380 |
| మిర్చి నిల్వ | : 11,870 |

## మిర్చి ధరలు

| | రూపాయలలో |
|---|---|
| 334 | 10,000 - 23,000 |
| నెం.5 | 13,000 - 21,000 |
| 273 | 15,000 - 18,500 |
| 341 | 10,000 - 22,000 |
| | నాన్ ఎసి |
| తేజ | 9,200 - 23,300 |
| బడిగి | 9,000 - 26,000 |
| దేవనూరు డీలక్స్ | 16,000 - 18,500 |
| తాలుకాయలు | 5,000 -14,500 |
| | ఎసి |
| 334 | 13,300 - 21,500 |
| 273 | 17,300 - 17,500 |
| 341 | 16,500 - 20,500 |
| తేజ | 12,000 - 23,000 |
| బడిగి | 14,000 - 26,500 |
| దేవనూరు డీలక్స్ | 16,300 - 19,500 |
| తాలుకాయలు | 6,000 -13,000 |

## గ్రామ సభను అడ్డుకుని.. దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు

**ప్రజాశక్తి-ప్రత్తిపాడు**

ప్రత్తిపాడులో బుధవారం జరిగిన గ్రామసభను ఓ వ్యక్తి అడ్డుకొని దుర్భాషలాడిన ఘటనపై పంచాయతి కార్యదర్శి సయ్యద్ జాన్ పీరా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రత్తిపాడు ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం బుధవారం గ్రామసభ ప్రారంభించే సమయానికి ఇదే గ్రామానికి చెందిన కమ్మ శివప్రసాద్, పంచాయతి కార్యదర్శితో అకారణంగా గొడవ పెట్టుకొని దుర్భాషలాడట మే కాకుండా గ్రామ సభ జరగనీయకుండా అడ్డ గించాడు. అతని విధులకు ఆటంకం కలిగిం చడం, పం చాయతి సిబ్బందిని కూడా అసభ్యపదజాలంతో దూషించాడు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్ఐ తెలిపారు.

---

**మహారాజశ్రీ పిడుగురాళ్ల జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో**

**I.A. No. 549/2022 I.A. No. 550/2022**
**IA 463/2023 OS No. 199/2019**

బిట్వీన్
కొరముట్ల విజయలక్ష్మి ... పిటీషనర్ / వాది
మరియు
చదలవాడ అంజయ్య వగైరాలు
... రెస్పాండెంట్లు / ప్రతివాదులు

**నోటీసు**

చదలవాడ పిచ్చయ్య తండ్రి లేటు అంజయ్య, పిడుగురాళ్ల టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.

పిటీషనరు / వాది పై నెంబరు పిటీషనర్స్‌లోని పరిహారములను కోరుతూ పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు వాయిదా ది. 17-11-2023న కలదు. సదరు వాయిదాకు మీరు ఉదయం 10-30 గం.లకు హాజరై పై కోర్టులో మీ ఆక్షేపణలు స్వయంగా గానీ, వకీలు ద్వారా హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

బై ఆర్డర్ ఆఫ్ కోర్ట్
వాయిదా : 17-11-2023

**డి.చెన్నయ్య,**
**అడ్వకేట్, పిడుగురాళ్ల.**
**ఫోన్ : 9440214833.**

---

**మహారాజశ్రీ నర్సరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో**
**ఐ.పి. 53/2023**

పిటీషనరు ... బుర్రి ఏడుకొండలు
అండ్
రెస్పాండెంట్లు :

| | |
|---|---|
| 1) భట్టు శ్రీను | 2) భట్టు బాలకృష్ణ |
| 3) అంకాల శ్రీను | 4) కొర్ని శ్రీనివాసరెడ్డి |
| 5) యన్నబత్తిని యల్లమంద | 6) మేడం రమణయ్య |
| 7) కైపు సుబ్బారావు | 8) ఎర్రిబోయిన శ్రీను |
| 9) మోటు కొండయ్య | 10) పెన్నబోయిన శ్రీను |
| 11) బుర్రి వెంకటసుబ్బయ్య | 12) మోటు సుబ్బారావు |
| 13) మోటు రమేష్ | 14) భట్టు గురవయ్య |
| 15) వల్లమాల బసవయ్య | |

పై నెంబరు ఐ.పి. దావాలో పిటీషనరు ఇందలి రెస్పాండెంట్లుకు ఇవ్వలసిన బాకీలు చెల్లించలేని పరిస్థితుల్లో వుండి పై నెంబరు ఐ.పి. దావా దాఖలు చేసినాడు. సదరు ఇందలి రెసాంపడెంట్లు గాక పిటీషనరు ఇంకా ఎవరికైనా డబ్బు బాకీ వున్న యెడల పై కోర్టువారి ఎదుట ది.16-10-2023వ తేదీ ఉదయం 10-30 గం.లకు హాజరు అయి వారికి గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల పరోక్షమందు తీర్మానించబడును.

**ఇట్లు**
**వై.శ్రీనివాసరావు,**
**పిటీషనరు తరపు అడ్వకేటు,**
**వినుకొండ.**

---

**IN THE COURT OF II ADDL. SENIOR CIVIL JUDGE FTC, GUNTUR**
**I.A. No. 405/2023 in OS 254/2015**

Between:
Koppaku Sri Lekha
... Petitioner / Defendant
Vs
Koppaku Krishna Kumari & other
...Respondents/ Plaintiff/ Defendant

**To,**
**R-2)** Koganti Sailaja W/o Sambasiva Rao, R/o Siripuram Village, Medikonduru Mandal, Guntur District.

పై నెంబరు దావాలో ఐ.ఎ. నెం. 405/2023లో 2 రెస్పాండెంట్స్ / ప్రతివాదులు అయిన మీకు నోటీసు నిమిత్తం పై కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఆర్డరు వేస్తూ ది. 19-10-2023 వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా గానీ, మీ తరపు వకీలు ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:19-10-2023

**కంచర్ల వసంత్‌కుమార్,**
**పిటీషనర్/వాది తరపు అడ్వకేటు,**
**సెల్ : 9246483666**

---

**2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి, గుంటూరు**
**I.A No 319/2023 in O.S.No.27/2023**

మధ్య:
చెన్నుపల్లి భరత్ కుమార్ ...వాది
మరియు
హరి వెంకట కిరణ్ కుమార్ మరియు ఇతరులు
...ప్రతివాదులు

**1వ ప్రతివాదికి సమన్లు:**

కనికరం హరి వెంకట కిరణ్ కుమార్ s/o. కనికరం వెంకటేశ్వర్ రావు, హెచ్.నెం. 14-80-6, బ్లాక్ 6, F-3, రాజీవ్ గృహ కల్ప అపార్ట్‌మెంట్స్, మోరిస్‌పేట్, తెనాలి-522202.

యిందలి వాది బాకీ వసూలు నిమిత్తం పై నెంబరు దావా వేసి మీకు ఎన్నిసార్లు సమన్లు జారీ చేయించిననూ నోటీసులు తీసుకోకుండా మభ్య పెడుతున్నందున ఈ పత్రికా ముఖంగా మీకు నోటీసు జారీ చేసియున్నారు. ది.20-10-2023 ఉదయం 10-30 గం.లకు పైన తెలిపిన కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలసినది. లేని యెడల మీ పరోక్షంలో తీర్మానించబడును.

**(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)**

వాయిదా తేదీ: 20-10-2023
గుంటూరు
తేదీ:12-10-2023

**శ్రీమతి. గాయత్రి, M.Arch, L.L.M**
**శ్రీ. మీనా కుమార్ రావిపూడి,B.Com, L.L.B**
**వాది తరపు న్యాయవాదులు**

---

**NOTICE**
**IN THE COURT OF THE HON'BLE XII ADDL.DIST.JUDGE: GUNTUR**
**I.A No.47/2021 ,I.A.No.48/2021 and I.A.No.49/2021 in O.S. No.26/2018**

Between:
Munnangi Srinivasa Reddy
...Petitioner/ Plaintiff
And
Atla Venkata Reddy and Others.
...Respondents/ Defendants

**To,**
**R-4:** Atla Hari krishnamma
D/o. Venkata Reddy
R/o. Agarthavarapadu (Vil),
Pedakakani (Md), Guntur Dist.

పై నెంబరు దావాలోని ఐ.ఎ.లలో 4వ రెస్పాండెంట్/ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తము శ్రీకోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఆర్డరు వేస్తూ ది:31-10-2023కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని,మీ తరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణ లు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:31-10-2023

**చింతలపాటి వేంకటరామయ్య,**
**పిటీషనరు/వాది తరపు న్యాయవాది,**
**2/10 బ్రాడీపేట, గుంటూరు.**

---

**దావా సమను**
**మహారాజశ్రీ గౌ॥ సత్తెనపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో**
**ఓ.యస్. 660/2022**

బిట్వీన్
గుంజి అంకమ్మరావు ... వాది
మరియు
పదిర గణేష్ ... ప్రతివాది

**టు :**

పదిర గణేష్, తండ్రి : వీరభద్రాచారి, నివాసం : డోర్ నెం. 6-87/1, పేరేచర్ల గ్రామం, మేడికొండూరు మండలం, గుంటూరుజిల్లా.

పై వాది, ప్రతివాది అయిన మీపై ప్రామిసరీ నోటు బాకీ రికవరీ నిమిత్తం దావా దాఖలు చేయగా ప్రతివాది అయిన మీకు కోర్టు, పోస్టు ద్వారా అనేకసార్లు దావాసమన్లు మీ నివాస స్థలమైన అడ్రస్‌కు పంపినా దావా సమన్లు తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి పంపుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయుటకు పై కోర్టువారు ఉత్తర్వులు ఇచ్చి యున్నారు. ఇందుపై ఆక్షేపణలున్న యెడల ది. 18-10-2023వ తేదీ ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మనవి చేసుకోవలసినది. లేనియెడల మీపై పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది: 18-10-2023
సత్తెనపల్లి.
ది.8-10-2023

**పి.వి.నరసింహశాస్త్రి,**
**అడ్వకేట్, సత్తెనపల్లి.**

సిఎంకు ఉత్తరాలు రాస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

## ముఖ్యమంత్రికి యుటిఎఫ్ ఉత్తరాలు

ప్రజాశక్తి - వినుకొండ

జిపిఎస్ రద్దు కోసం ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు పంపనున్నట్లు యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. యుటిఎఫ్ నియోజకవర్గస్థాయి సమావేశం పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం నిర్వహించి ఉత్తరాలు రాశారు. సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎం.రవిబాబు అధ్యక్షత వహించగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ అనేక రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు సిపిఎస్ స్థానంలో ఓపీఎస్‌ను ప్రవేశపెడుతుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం జిపిఎస్‌ను తెచ్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మెమో 57 అనుసరించి 2004 సెప్టెంబర్ ఒకటికి ముందు నియామక ప్రక్రియ పూర్తయిన వారందరూ పాత పెన్షన్‌కు అర్హులని, డీఎస్సీ-2003 ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఈ మేరకు సిఎంకు వారం రోజుల్లో ఉత్తరాలు పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్.అజయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.పోలయ్య, నాయకులు జి.నాగరాజు, పి.రమేష్‌బాబు, జిలాని, రామారావు, తిరుపతిరెడ్డి, మల్లికార్జున, గోపిరాజు, ప్రసాదు, శివారెడ్డి, నాగేంద్రుడు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖాధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## విద్యుత్ కోతలు, ఎరువుల ధరలపై టిడిపి ఆందోళన

ప్రజాశక్తి-ఈపూరు

ఇష్టానుసారంగా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో పంటలు ఎండిపోతున్నాయని మండల కేంద్రమైన ఈపూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ వ్యవసాయానికి 9 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా కనీసం నాలుగు గంటలైనా సరిగా సరఫరా చేయడం లేదని అన్నారు. లో వోల్టేజీ సమస్యతో వ్యవసాయ బోరు మోటార్లు మొరాయిస్తున్నాయని, మోటార్ల కింద పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పారు. ముందస్తు సమాచారం లేకుండా ఇష్టానుసారంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని విమర్శించారు. కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సబ్ ఇంజినీర్ శ్రీనివాసరావుకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి రైతుల సమస్యలపై తహశీల్దార్ అచ్యుత వెంకట సుధాకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యూరియా, డిఎపి తదితర ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలి వెళ్తున్నాయని చెప్పారు. వీటిని తక్కువ ధరలకు ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్.జగ్గారావు, జి.వెంకయ్య, ఎ.కోటేశ్వరరావు, బాలయ్య, జి.వీరాంజనేయులు, ఎన్.కిషోర్, మోషే పాల్గొన్నారు.

# అమ్మకు కూతురే అమ్మ.. నాన్నకు ఓదార్పు..

### బాలికా దినోత్సవంలో పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

హార్డ్ స్కూల్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ. ఎస్ఎస్ఎన్ కాలేజీలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ బి.రవి

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

అమ్మకు ఆరోగ్యం బాగా లేకుంటే కూతురే అమ్మకు అమ్మవుతుంది.. నాన్న మనసుకు కష్టం కలిగితే కూతురే ఓదార్పు అవుతుంది.. అని పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఒ) డాక్టర్ బి.రవి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కాలేజీలో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ గత పదేళ్లలో బాలికలకు సంబంధించిన సమస్యలపై శ్రద్ధ పెరిగిందని, ప్రపంచ వేదికలపైనా బాలికలు తమ గళాన్ని వినిపించడానికి అవకాశాలు పెరిగాయని చెప్పారు. అయినా బాలికలకు హక్కులపై అవగాహన పరిమితంగానే ఉందని, ప్రపంచ వ్యాప్తంగా బాలికలు లింగ అసమానత వివక్షతకు గురవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. బాలికలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే క్రమంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, వారిని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇందులో కుటుంబీకులతోపాటు సమాజమూ ముఖ్యపాత్ర పోషించాలని కోరారు. 'డిజిటల్ జనరేషన్-అవర్ జనరేషన్' అనే నినాదం బాలికలకు అత్యవసరమన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు అందరూ కృషి చేయాలన్నారు. లింగ నిర్ధారణ చట్టం నోడల్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ లింగ వివక్షత ఉండకూడదని, మహిళల వెనకబాటుకు వారిపట్ల ఉన్న చిన్నచూపు కూడా ఒక కారణమని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ సోము మల్లయ్య మాట్లాడుతూ సమానమైన అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వంతో పాటు సమాజమూ చేయూతనివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ సుధీర్, ఎం.అనిల్ కుమార్, డాక్టర్ పిఎన్‌విడి మహేష్, డాక్టర్ ఎం.రమేష్, డి.రామకృష్ణారెడ్డి, ఖాజావలి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**కొనసాగుతున్న వివక్ష : ట్రైనీ కలెక్టర్**

పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నా కొంత మేరకు వివక్ష మాత్రం కొనసాగుతూనే ఉందని ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. నరసరావుపేటలోని హార్డ్ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమానికి ట్రైనీ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి బాలిక సంరక్షణ జిల్లా అధికారి బి.విజయ్ కుమార్ అధ్యక్షత వహిచగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలకూ సమాన హక్కులున్నాయని చెప్పారు. మానసికంగా మహిళలు ధృడంగా ఉండాలని, పని ప్రదేశాల్లో సమస్యలు ఎదురైతే పెద్దలకు, పోలీసులకు ధైర్యంగా చెప్పి వాటిని పరిష్కరించు కోవాలని చెప్పారు. హక్కులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ పద్మావతి, దిశ ఎస్ఐ గౌతమి, ఐసిడిఎస్ జిల్లా పీడీ బి.అరుణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

విద్య వల్లనే జీవితాల్లో మార్పు సాధ్యమని ఎంఇఒ వి.నాగయ్య అన్నారు. స్థానిక జెడ్‌పి పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇదే పాఠశాలలో తాము చదువుకున్నామని, పాఠశాలకు పక్కనే చాలా పెద్ద ఆట స్థలం ఉండేదని, అది ఆక్రమణకు గురవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థి అయిన నాగరాజు మైక్‌సెట్ కొనుగోలుకు రూ.10 వేలను పాఠశాలకు విరాళంగా ఇచ్చారు. హెచ్ఎం షేక్ షకీనా, ఉషారాణి, కౌన్సిలర్ జి.అరుణ కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇదే పాఠశాలలలో జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఇన్‌ఛార్జి హెచ్ఎం ఉషారాణి అధ్యక్షత వహించగా ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి మాట్లాడారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జెవికెస్ ప్రసాదు, గౌరవ అధ్యక్షులు కె.ఆదినారాయణ, ఆయేషా సుల్తానా, పి.నరసింహరావు పాల్గొన్నారు.

మాచర్ల జెడ్‌పి పాఠశాలలో..

ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు

## 4వ సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మంగళవారం విడుదల చేసిన బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్ ద్వితీయ సంవత్సంర 4వ సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు అన్ని గ్రూపుల్లో అధికంగా మార్కులు సాధించడంతోపాటు పల్నాడు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారని ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. బీఎస్సీ (బిజడ్‌సి)లో ఎ.లేఖ 1000 మార్కులకు 980 మార్కులు (98.6) సాధించగా బీఎస్సీ (ఎంఎస్‌సిఎస్)లో పి.పావని 900 మార్కులకు గాను 878 మార్కులు (97.5) సాధించినట్లు తెలిపారు. బీఎస్సీ (ఎంపిసి)లో ఎం.లక్ష్మిశివగోపిక 900 మార్కులకు గాను 862 మార్కులు, బీఎస్సీ (ఎంపిసిఎస్)లో కె.లక్ష్మి నోమిత 900 మార్కులకుగాను 866 మార్కులు, బిఎస్‌సి (ఎంబిసిసిఎస్)లో కె.మానస 1000 మార్కులకు గాను 935 మార్కులు, ఎం.వెంకటలక్ష్మి బీఎస్సీ (ఎంసిసిఎస్) 900 మార్కులకు గాను 813 మార్కులు సాధించినట్లు తెలిపారు. బీకాం కంప్యూటర్స్‌లో పి.సౌజన్య 800 మార్కులకు గాను 708 మార్కులు సాధించి వర్సిటీ స్థాయి మార్కులతో తమ కళాశాలకు గుర్తింపు తెచ్చారని అన్నారు. అనుభవం కలిగిన అధ్యాపకులతో అధునా తన బోధనా పద్ధతులు పాటించడం వల్ల ఈ ఫలితాలు సాధ్యమైనట్లు చెప్పారు. ఈ మేరకు విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాలల డైరెక్టర్ కె.నాసరయ్య, టిపిఒ ఎం.బాలకోటేశ్వరరావు, ఎస్.కె ఎంఎం బాష, ఇతర అధ్యాపకులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

బహుమతులు పొందిన జట్లతో కలెక్టర్ ఎల్.శివశంకర్ తదితరులు

## ఓటమే గొప్ప విజయానికి నాంది

### కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి - వినుకొండ

ఒక ఓటమి గొప్ప విజయానికి నాంది పలుకుతుందని, గెలుపోటములు ముఖ్యం కాదని, క్రీడల్లో పాల్గొనడం ముఖ్యమని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక సాయిరాం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులను స్థానిక జాషువా కళా ప్రాంగణంలో బుధవారం ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ కబడ్డీ వల్ల టీం స్పిరిట్, లైఫ్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు అలవడతాయని చెప్పారు. క్రీడల వల్ల దేహదారుఢ్యంతోపాటు ఆత్మవిశ్వాసం, మానసిక వికాసం అభివృద్ధి చెందుతాయన్నారు. కష్టం విలువను, దాని వల్ల వచ్చే ఫలితాలను విద్యార్థులకు అర్థం చేయించగలిగితే ఇష్టంగా చదువుతారని, ఆ దిశగా ఉపాధ్యాయులు ప్రేరణ కల్పించాలని సూచించారు. ఇదిలా ఉండగా మొదటి బహుమతిని గీతాంజలి పాఠశాల బి.నందకిషోర్ జట్టు, రెండో బహుమతిని భాష్యం పాఠశాల కె.పవన్ కుమార్ జట్టు, మూడవ బహుమతి ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల వినుకొండ బి.భరత్ నాయక్ జట్టు గెలుచుకున్నాయి. ఆయా జట్లకు వరుగా రూ.10116... రూ.7116... రూ.5116 నగదు బహుమతులతోపాటు కప్పులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకయ్య, తహశీల్దార్ కిరణ్, ఎంఇఒ సయ్యద్ జాఫ్రుల్లా, కౌన్సిలర్లు షకీలా, కె.బ్రహ్మయ్య, సాయిరాం ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ ఎం.చంద్ర, బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బివి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరోనా కాలంలో సేవా కార్యక్రమాలు నిర్వహించిన వారిని సత్కరించారు.

## 16వ తేదీ నుండి ఈవీఎంల తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఈవియంలకు నిర్వహిస్తున్న మొదటి లెవెల్ చెకింగ్ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వి.సి.సమావేశ మందిరంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డిఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్-2024, ఎన్నికలకు సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ టి.సేవాకుమార్, బిఎస్‌పి గుంటూరు పశ్చిమ నియోజక వర్గ ఇన్‌చార్జ్ సిహెచ్.వాసు, బిజెపి జిల్లా జనరల్ సెక్రెటరీ ఆర్.వెంకట భాస్కరరావు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్ళా సునీల్, టిడిపి ఆఫీసు సెక్రెటరీ కంచెర్ల శివరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాకు వచ్చిన ఈవియంలకు సంబంధించి కంట్రోల్ యూనిట్ , బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్లను బిఈఎల్ ఇంజినీర్లు అక్టోబర్ 16వ తేది నుండి ఫస్ట్ లెవెల్ చెకింగ్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రెవెన్యూ కళ్యాణ మండపంలో నిర్వహిస్తారన్నారు. దీనిలో పాల్గొనే పార్టీల ప్రతినిధుల వివరాలు అందిస్తే పాస్‌లు జారీ చేస్తామన్నారు. ఈ చెకింగ్‌లో భాగంగా ప్రతి ఈవియం యూనిట్‌లో 96 ఓట్లు పోల్ చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా మొత్తం ఈవియం యూనిట్లలో ర్యాండమ్‌గా రాజకీయ పార్టీ ప్రతినిధులు సెలెక్ట్ చేసిన రెండు శాతం యూనిట్లలో 1200 ఓట్లు , ఒక శాతం యూనిట్లలో వెయ్యి ఓట్లు, ఒక శాతం యూనిట్లలో ఐదు వందల ఓట్లు మాక్ పోలింగ్ నిర్వహించి ఫలితాలు పరిశీలించిన తరువాతే తనిఖీ పూర్తి చేసి సర్టిఫై చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకట శివరామి రెడ్డి, లలితా జిఎంసి అదనపు కమిషనర్ పెద్ది రోజ, ఆర్‌డిఓ ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

## 20వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు :మెట్రో నగరాలకు ధీటుగా గుంటూరులో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 20వ డివిజన్‌లో రూ.63.20 లక్షలతో సిసి డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 20వ డివిజన్‌లో సుబాని కాలనీలో రూ.13.70లక్షలతో కల్వర్ట్, కొబ్బరితోట ప్రాంతంలో రూ.49.50 లక్షలతో డ్రైన్లు నిర్మించనున్నట్లు చెప్పారు. గుంటూరు నగరాన్ని వైజాగ్, విజయవాడ లాంటి నగరాలకు ధీటుగా అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధి పేరుతో గుంటూరుని గుంతలూరుగా మార్చారని, నగర పాలక సంస్థ నూతన కౌన్సిల్ ఏర్పడ్డాక గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు ఎంతో వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పోరేటర్లు గేదెల నాగరంగమణి రమేష్, సాదు ఉమా మహేశ్వరి రాజేష్, బోగిసం ప్రసాద్, కంతేటి శ్యాంశేఖర్ పాల్గొన్నారు.

## ఎపి ఎల్‌పిజి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా త్రినాథ్‌రెడ్డి, రామ్‌కుమార్**

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్ కరకట్ట మీద ఉన్న విజయవాడ క్లబ్‌లో బుధవారం రాష్ట్ర ఎల్‌పిజి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. నూతన అధ్యక్షునిగా త్రినాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎఎస్ రామ్‌కుమార్, కోశాధికారి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి సతీష్ చంద్రారెడ్డి, మహిళా ఉపాధ్యక్షులు నిమ్మగడ్డ సాధన భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా త్రినాథ్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్యానెల్‌కు మద్దతు తెలిపిన వారికి అభినందనలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1100 మంది డిస్ట్రిబ్యూటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. అందరి సూచనలతో ప్రజల మెప్పు పొందే విధంగా కృషి చేస్తామని హామీనిచ్చారు. 4.50 కోట్ల మందికి ఇంటింటికీ గ్యాస్ సరఫరాను మెరుగుపరుస్తామని హామీనిచ్చారు. 50 వేల మంది దీపం కనెక్షన్ వినియోగదారులకు కూడా సక్రమంగా గ్యాస్ సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకోవాలని కోరారు. కరోనా సమయంలో చనిపోయిన డిస్ట్రిబ్యూటర్లక సంతాపం తెలియజేశారు.

## విద్యుత్‌ను పునరుద్ధరించాలని ధర్నా

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లిలోని ఎత్తిపోతల పథకానికి విద్యుత్ పునరుద్ధరించాలని బుధవారం అమరావతి - విజయవాడ రహదారిపై రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర రావు మాట్లాడుతూ రైతుల ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి రైతులకు పంట నీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు విద్యుత్ సౌకర్యం తొలగించడం సరైనది కాదన్నారు. పంపింగ్ స్కీమ్‌కు విద్యుత్ నిలిపివేయడంతో పంటలకు నీరందక రైతాంగం ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ ఏడాది వర్షాలు లేక అతివృష్టి, అనావృష్టితో ఇప్పటికే రైతులు నష్టాల బాట పట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఎత్తిపోతల పథకానికి సంబంధించి విద్యుత్ బకాయి చెల్లించి విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షులు కె.ఈశ్వరరెడ్డి, ఉండవల్లి ఉపాధ్యక్షులు పి.వీరాస్వామి, ఇస్సాకు, బాలయేసు, సాంబశివరావు, బి.పద్మారెడ్డి, కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న జొన్నా శివశంకర్



ఈఈతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు, రైతులు

## రెండ్రోజుల్లో సాగునీరు విడుదల చేయాలి

**మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, నక్కా ఆనందబాబు**

ప్రజాశక్తి-తెనాలి :పొలాలు ఎండిపోయి రైతాంగం సాగునీటి కోసం ఎదురు చూస్తోందని, రెండు రోజుల్లో వారికి సాగునీరు అందించాలని టిడిపి పొలిట్ బ్యూర్ పభ్యులు నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధికారులను కోరారు. స్థానిక కృష్టా వెస్టన్ డెల్టా ఇరిగేషన్ ఈఈ కార్యాలయం వద్ద టిడిపి ఆధ్వర్యంలో సాగునీరు ఆందకపోవటంపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆనందబాబు, ఆలపాటి మాట్లాడుతూ వ్యవసాయంపై అవగాహన లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తుంటే ఏమాత్రం స్పందన లేకుండా అధికారులున్నారన్నారు. డెల్టాలో దాదాపు 5.70లక్షల ఎకరాల్లో వరి సాగులో ఉందని, రైతాంగం ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే సాగునీరు అందించాలని, లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. రెండు రోజుల్లోగా సాగునీరు విడుదల చేయకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈఈ ఎస్.మల్లిఖార్జునకు వివరించి, వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో తెనాలి, వేమూరు నియోజకవర్గాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## రెండో రోజుకు ఆశాల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి ముగ్గురోడ్డుకు చెందిన ఆశ వర్కర్ కృపమ్మ మృతికి కారణమైన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న దీక్షలు బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి, మండల ఆశ వర్కర్స్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు మాట్లాడుతూ యుపిహెచ్‌సి అవార్డుల కోసం మెడికల్ ఆఫీసర్లు ప్రకాష్‌నగర్‌లోని యుపిహెచ్‌సిలో పని చేస్తున్న ఆశాలపై, ఎఎన్‌ఎంలపై తీవ్రమైన పని ఒత్తిడి తెస్తున్నారన్నారు. అనవసరమైన యాప్‌ల పేరుతో వారికి నైపుణ్యం లేని పనులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవులు లేకుండా చట్ట విరుద్ధంగా పనులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రకాష్‌నగర్ యుపిహెచ్‌సి మెడికల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ హెల్త్ సెంటర్‌లోని ఆశ వర్కర్ చనిపోతే పరామర్శించడానికి కూడా రాకపోతే ఏమనాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆశ వర్కర్లకు మనోధైర్యం కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు శౌరిబర్తులం మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఎస్ పూర్ణచంద్రరావు, విఆర్ఎల అధ్యక్షు లు సాంబశివరావు, ఆశాలు విజయశ్రీ, కె.లక్ష్మి, వి.రేణుక, సుగుణ, కన్యాజ్యోతి, స్వర్ణకుమారి, బేబి, విజయలక్ష్మి, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సదుపాయాలు మెరుగు పరచాలి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరులో తాగునీటి సరఫరా మెరుగు పర్చాలని, కలుషిత నీటి సరఫరా వల్ల ప్రజలు రోగాల పాలవుతున్నారని టిడిపి గుంటూరు తూర్పు నియోజకవర్గం ఇంచార్జి మొహమ్మద్ నసీర్ ఆవేదన వ్యక్తం చేశారు. పాత గుంటూరు, ఆనందపేట , బాలాజీ నగర్, వినోబా నగర్, ప్రగతి నగర్ మరియు పలు ప్రాంతాల్లో కలుషిత నీటి వల్ల ప్రజలకు విష జ్వరాలతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకొని నందివెలుగు రోడ్డు, పొన్నూరు రోడ్డు లలో ఉన్న వాటర్ రిజర్వాయర్ ట్యాంక్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో కలుషిత నీరు వస్తుందని దీంతో చాలా మందికి విష జ్వరాలు వస్తున్నాయన్నారు. సరైన క్లోరినేషన్ చేసి పరిశుభ్రమైన నీటిని సరఫరాచేయాలని అధికారులనుకోరారు. ఆయన వెంటన టిడిపి నాయకులు యల్లావుల అశోక్, షేక్ రబ్బాని, బట్ట రాజా, జ్యోతుల జస్వంత్, గొళ్ల ప్రభాకర్, రియాజ్, వేములకొండ శ్రీనివాసరావు, వేల్చూరు కిరణ్, కొనకళ్ల సత్యం, పాటిబండ్ల బలరాం, హఫీజ్, నాగిరెడ్డి, నాయుడు మధు, సముద్రాల గణేష్, తిరుమల రాజు, దాసరి రావణ్, రుద్ర సాయి, తదితరులు పాల్గొన్నారు.

నందివెలుగు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న నశీర్ అహ్మద్

**వేజెండ్ల జడ్‌పి పాఠశాల విద్యార్థినులు**

## వాలీబాల్ జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక

ప్రజాశక్తి - చేబ్రోలు :అండర్ 17 బాలికల వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేజెండ్ల విద్యార్థినిలు షేక్ సోనీ, మట్టుపల్లి సుమశ్రీ ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి విజయశ్రీ బుధవారం తెలిపారు. షేక్ సోనీ మట్టుపల్లి సుమ ఉమ్మడి గుంటూరు జిల్లా వాలీబాల్ జట్టులో ఈనెల ఏడవ తేదీ నుండి తొమ్మిదవ తేదీ వరకు కడప జిల్లా మైదుకూరులో జరిగిన అండర్ 17 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలలో ద్వితీయ స్థానంలో విజయం సాధించారని తెలిపారు. నవంబర్ నెలలో చెన్నైలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇచ్చినందుకు పిఈటి తిరుమల శెట్టి వెంకటేశ్వరరావును, విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాఠశాల కమిటీ అభినందించారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఇంటెల్ హైస్కూల్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - మేడికొండూరు

విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడ ఏదైనా ఇష్టంతో కష్టపడి లక్ష్యం దిశగా రాణిస్తే విజయం ప్రతి ఒక్కరికి దరి చేరుతుందని ఇంటెల హై స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయ కుమార్ అన్నారు. మండలంలోని పేరేచర్ల ఇంటిల్ హైస్కూల్లో బుధవారము రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు అభినందన సభ జరిగింది. 9వతేదీన చిలకలూరపేట ఏఎంజి స్కూల్లో నెట్ బాల్, హ్యాండ్ బాల్, జూడో విభాగాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపికలు జరిగాయి. నెట్ బాల్ అండర్ -14 బాలుర విభాగంలో ఇంటిల్ హై స్కూల్‌కి చెందిన విద్యార్థులు సంజయ్, బాలికల విభాగంలో షేక్ ముస్కాన్, అండర్ -17 బాలుర విభాగంలో ప్రవీణ్, బాలికల విభాగంలో పి.అఖిల సాయి, అండర్- 19 బాలుర విభాగంలో హేమంత్, బాలికల విభాగంలో నాగసాయి, ప్రసన్న, అమృత వర్షిణి, జూడో అండర్ -17 బాలుర విభాగంలో అభిరామ్ సాయి, హ్యాండ్ బాల్ అండర్- 19 బాలుర విభాగంలో అనిల్ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఇంటెట్ హై స్కూల్ ప్రిన్సిపల్ కోనూరి రాణి జయకుమార్ తెలిపారు. మొదటి ప్రయత్నంలోనే తమ స్కూల్ కి చెందిన విద్యార్థులు ఎక్కువమంది రాష్ట్రస్థాయి జట్లకు ఎంపికవటం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభి నందన సభలో విద్యార్థులను అభినందించారు. కార్య క్రమంలో పీఈటి షేక్ రన్ను హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# రక్త హీనతను అధిగమిస్తే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కిషోర బాలికలలో రక్తహీనత తగ్గుదల వల్ల ఆక్సిజన్ సరఫరా తగ్గి పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తద్వారా చదువుపై దృష్టి సారించడం జరగదని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక నరసరావుపేట భువనచంద్ర టౌన్ హాల్ నందు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బంగారు తల్లి ప్రోగ్రెస్ కార్డుల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

మంత్రి మాట్లాడుతూ రక్తం తక్కువగా ఉన్న వారికి పోషకాహారాలు అందించడం ద్వారా హిమోగ్లోబిన్ పెరుగుతుదేని తద్వారా చురుకుదనం పెరిగి ఉత్తీర్ణత శాతం పెరుగుతుందన్నారు. హిమోగ్లోబిన్ ప్రోగ్రెస్ కార్డు ద్వారా చాలా ఉపయోగాలు ఉన్నాయని తద్వారా పిల్లలకు ఐరన్ సమృద్ధిగా ఉండే, బెల్లంతో చేసిన పదార్థాలు, ఆకుకూరలు, పాలు, గ్రుడ్డు వంటివి అందించాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీకృష్ణదేవ రాయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి కార్యక్రమం ద్వారా అందిస్తున్న నగదును సద్వినియోగం చేసుకొని కిషోర బాలికలకు పౌష్టికాహారాన్ని అందించేలా చూడాలన్నారు. బంగారు తల్లి కార్యక్రమం అమలులో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన అభిజిత్ బెనర్జీ గురించి పిల్లలకు అర్థమయ్యేలా వివరించారు.

బంగారు తల్లి ప్రోగ్రెస్ కార్డుల ఆవిష్కరణలో మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు

కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ బంగారు తల్లి ముఖ్య ఉద్దేశం రక్తహీనత ఉన్న పిల్లలలో కనీసం హిమోగ్లోబిన్‌ను 9 శాతానికి పెంపొందించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమం ద్వారా అందిస్తున్న రాగి జావా, గుడ్డు చెక్కిలను చిక్కిలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తద్వారా పౌష్టికాహారం పెరుగుతుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బంగారు తల్లి హిమోగ్లోబిన్ ప్రోగ్రెస్ కార్డు స్కూల్ లో ఇస్తున్న ప్రోగ్రెస్ కార్డు లాగా ఉందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ బి.పూజిత రామిరెడ్డి

## బొల్లవరంలో 'ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-ముప్పాళ్ల

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా అందే వైద్య సేవలను వినియోగించుకోవాలని బొల్లవరం సర్పంచ్ బి.పూజిత రామిరెడ్డి అన్నారు. బొల్లవరంలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్య క్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆరోగ్య సురక్ష ద్వారా అందే సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ భవానీశంకర్,ఈవోఆర్డి రూపావతి, మండల వెసిసి నాయకులు ఎస్.గోపాలరావు, ఆర్.వెంకటేశ్వరరెడ్డి, బి. వెంకట రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

## మంచినీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మున్సిపల్ పంప్ హౌస్ లో వ్యాక్యూమ్ మోటర్ చెడిపోవడం వలన పట్టణంలో మంచినీటి సరఫరాకు గురువారం అంతరాయం ఏర్పడనుందని మాచర్ల మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి సరఫరా చేసే మోటార్లలో వ్యాక్యూమ్ మోటర్ చెడిపోవడం వలన మరమ్మత్తుల కోసం పిడుగురాళ్ల నుంచి మెకానిక్ ను పిలిపించినా ఫలితం లేకపోయిందని అన్నారు. గురువారం విజయవాడ నుంచి నూతన మోటం,మెకానిక్ రానున్నారని, మరమ్మత్తుల ప్రక్రియ గురువారం సాయంత్రం కల్లా పూర్తవనుందని వివరించారు. పట్టణ ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి తమకు సహకరించాలని కమిషనర్ రమణబాబు ప్రజలను కోరారు.

## బాలికల ఉన్నతికి కృషి

ప్రజాశక్తి-పెదకూరపాడు

బాలికల ఉన్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకట రమణ కోరారు. బుధవారం ఆ పాఠశాలలో బాలికా దినోత్సవం గురించి వివరించారు. బాలికా విద్యను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, వారి పట్ల లింగ వివక్ష చూపడం నేరమని అన్నారు. బాలికలు ఎక్కడైతే ఉన్నత విద్యను అభ్యసిస్తారో సమాజం మరింత ముందుకు వెళుతుందని చెప్పారు.

## కారంపూడి మండల ఉపాధ్యక్షురాలు రాజీనామా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడుజిల్లా కారంపూడి మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు గుండెబోయిన. అమతలక్ష్మి అనారోగ్య

కారణంతో తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా లేఖను గుంటూరులో జిల్లా పరిషత్ సిఈవో మోహనరావుకు అందచేశారు. రాజకీయ ఒప్పందం ప్రకారం రెండేళ్ళ పదవీ కాలం పూర్తవ్వడంతో మరొక ఎంపిటిసికి అవకాశం కల్పించేందుకు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచనలతోఆమె రాజీనామా చేసినట్టు తెలిసింది. రెండేళ్ల కాలంలో తాను ప్రజా సమస్యలపరిష్కారం కోసం కృషి చేశానని అమృత లక్ష్మీ తెలిపారు. అనారోగ్య కారణాలతోనే రాజీనామా చేసినట్టు వివరించారు.

## నవంబర్‌లో బైపాస్ పూర్తి .. జానపాడు ఆర్‌ఒబికి శంకుస్థాపన

### గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలంలోని జానపాడు గ్రామస్తుల కల త్వరలో నెరవేరబోతుందని గురజాల శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని జానపాడు రోడ్డు నందు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న మట్టి పరీక్షలను ఆయన పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరు గురించి అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా జానపాడు, పందిటివారిపాలెం, జూలకల్లు గ్రామస్తులకు పిడుగురాళ్ల వచ్చేందుకు ప్రధాన ఇబ్బంది జానపాడు రైల్వే గేట్ అని, గేటు పడిన సమయంలో సుమారుగా అరగంటకు పైగా నిలిచిపోవాల్సి వస్తుందని, ట్రాఫిక్ సమస్య కూడా తీవ్రంగా ఉంటుందని అన్నారు.అందుకే కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి

రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించబోతున్న మొదటి విడత ఆర్‌ఒబిలలో పిడుగురాళ్ల జానపాడు రోడ్డు ఆర్‌ఓబి కూడా చేర్చడం జరిగిందని చెప్పారు. ఆర్‌ఒబి నిర్మాణం వల్ల జానపాడు ఎంతో అభివృద్ధి చెందుతుందని, గ్రామంలో భూమి ధరలు పెద్ద మొత్తంలో పెరుగుతాయని అన్నారు. పిడుగురాళ్ల బైపాస్ నిర్మాణానికి సంబంధించి ఐరన్ లెటర్ పరీక్షలు పూర్తయ్యాయని, మరో రెండు వారాలలో పిడుగురాళ్లకి వచ్చే అవకాశం ఉందని, నవంబర్‌లో పిడుగురాళ్ల బైపాస్ ప్రారంభం, అలాగే జానపాడు రోడ్డు ఆర్‌ఓబి శంకుస్థాపన చేస్తామని చెప్పారు.

## గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు బెల్లంకొండ ఎస్సై షేక్ అమీర్ తెలిపారు. మండల కేంద్రమైన బెల్లంకొండ నుంచి బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు గుంతల మయమైన రోడ్డుకు బుధవారం ఆయన స్వయంగా మరమ్మతులు చేయించారు. ఎస్సై మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రజలు రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని, మైనర్లకు మోటారు వాహ నాలు ఇవ్వొద్దని వారి తల్లిదండ్రులకు సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అతివేగంతో వాహనాలు నడిపే వారిపై

చట్టపైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని అన్నారు. ప్రతి ఒక్కరు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనా చట్టాలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఉరితాళ్లు బిగించుకుని నిరసన

## 'జాబ్ క్యాలెండర్ విడుదల చేయండి'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వారిని మోసం చేశారని సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చిన్నబోయిన రాఘవరావు విమర్శించారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరుతూ తెలుగు యువత ఆధ్వర్యంలో ఉరి తాళ్ళు బిగించుకుని బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ ఉద్యో గాలు కల్పింక పోగా యువతను గంజాయి వైపు అలవాటు పడేలా చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయిని విచ్చలవిడిగా అమ్ము తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టి ఆయనకు బెయిల్. రాకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా దీవెన , వసతి దీవెన పథకాలను సక్రమంగా అమలు

సత్తెనపల్లిలో ఉరితాళ్ళు బిగించుకుని నిరసన వ్యక్తం చేస్తున్న తెలుగుయువత నాయకులు

చేయాలని, ఉద్యోగం వచ్చే వరకూ నిరుద్యోగులకు భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి ఒక్కంటి అజయ్‌కుమార్, యువ నాయకులు డాక్టర్ వి. పవన్ కుమార్, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు ఎన్.కార్తీక్, పార్లమెంట్ తెలుగు యువత నాయకుడు షేక్ నాగూర్ వలి, పల్నాడు జిల్లా తెలుగు యువత కార్యదర్శి జె.శ్రీనివాసరావు. పల్నాడు జిల్లా తెలుగు యువత కార్యదర్శి ఎం.రవిచంద్ర. పట్టణ తెలుగు యువత అధ్యక్షులు ఎన్. ప్రకాష్‌రావు పాల్గొన్నారు .

## రీ - సర్వే పనుల పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని లింగంగుంట్ల అగ్రహారం గ్రామ భూములలో జరుగుతున్న రీ సర్వే పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రీ – సర్వే పనులు జరుగుతున్న తీరును రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ – సర్వే పనులు తర్వాత రైతులు,సాధారణ ప్రజలు రెవెన్యూ పనులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వే సందర్భంగా వస్తున్న వివాదాలను పరిష్కరించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమణ నాయక్ పాల్గొన్నారు.

## బెట్టను తట్టుకునేందుకు మల్టీ కె దోహదం

### డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో పత్తి పైరు బెట్టకు రావడంతో రైతులు పంటను వదిలివేయడం మల్టీ కె (13.0.45, లేదా 17-17-17) మందును ఏదైనా పురుగుమందుతో కలిపి పిచికారి చేయడం వలన కొంతమేర బెట్ట పరిస్థితుల నుండి కొన్ని రోజులపాటు పంటను కాపాడుకునే అవకాశం ఉంటుందని డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ జి రమేష్ అన్నారు. బుధవారం పత్తి పొలాల క్షేత్ర సందర్శన కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట మండలంలోని రెడ్డిపాలెం, అగ్రహారం,ఇస్సపాలెం, కండ్లకుంట గ్రామాలలో రైతుల సాగు చేస్తున్న పత్తి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ సమగ్ర యాజమాన్య చర్యలతో పత్తిలో విజంభిస్తున్న గులాబీ రంగు పురుగును అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు.

## మిరప రైతులకు అవగాహన

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలోని చంద్రాజుపాలెంలో నీలగిరి ఫౌండేషన్, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టుకు సంబంధించిన వారు మిరప పండించే రైతులకు బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు స్టేట్ రిసోర్స్ పర్సన్ రైతు సాధికార సంస్థ కె. రామచంద్రం, పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ కె. అమల కుమారి , నీలగిరి ఫౌండేషన్ నుంచి రత్తయ్య, కెవికె శాస్త్రవేత్త డాక్టర్ గంగ భవాని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. రామచంద్రం మాట్లాడుతూ మిరప రైతులు మొదటగా 30 రకాల విత్తనాలతో పిఎండిఎస్ వేసుకోవాలని, తర్వాత మిరప పంట రైతులు దుక్కిలో మొదటగా ఘనజీవామృతం వేసి, నారు శుద్ధి చేసుకొని నాటు కోవాలని తెలియజేశారు. అనంతరం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. అమల కుమారి మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో మొత్తం 36వేల ఎకరాల్లో ప్రకతి వ్యవసాయం చేస్తున్నారని, అన్నారు.

## పేదలకు కార్పొరేట్ వైద్యం

### జాయింట్ కలెక్టర్ రాజకుమారి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

రాష్ట్రంలోని పేద ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారని గుంటూరు జాయింట్ కలెక్టర్ రాజకుమారి అన్నారు. పొన్నూరు మండలం మామిళ్ళపల్లిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సభకు ఈ పొన్నూరు ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెసి మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష పథకం ఐదు దశల్లో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో 520 మందికి పైగా వైద్య పరీక్షల నిర్వహించి రోగ నిర్ధారణ చేసిన రోగులకు ఉచితంగా మందులు, కళ్ళజోళ్లను జాయింట్ కలెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను ఆమె ప్రారంభించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ ఎస్.కేదార్నాథ్ శ్రీకాంత్ ఆక్సిజన్ ప్లాంట్లను అందజేశారు. మన్నవ పీహెచ్ సి సి వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది ల్యాబ్ టెస్టులు, వైద్య పరీక్షలు చేశారు.

మెడిసిన్ కిట్ అందచేస్తున్న మేయర్, ఎమ్మెల్యే తదితరులు

## సురక్ష క్యాంపును సందర్శించిన మేయర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా లభిస్తుందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. బుధవారం గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు మద్దాలి గిరిధర్ తో కలిసి మేయర్ సందర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బూసి రాజలత, షేక్ మహమూద్, టి.యల్.వి ఆంజనేయులు,జిల్లా గ్రంథాలయ చైర్మన్ బత్తుల దేవానంద్, డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఎంహెచ్ఓ భాను ప్రకాష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రముఖ న్యాయవాది కాళిదాసు

## బాలికల హక్కులు కాపాడాలి

ప్రజాశక్తి,-పెదకాకాని రూరల్

బాలికల హక్కులు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, బాలికలు కూడా తమ హక్కులను వినియోగించుకోవాలని ప్రముఖ న్యాయవాది కాళిదాసు తెలిపారు. బుధవారం పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని మంగళగిరి గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ఇంచార్జ్ సిస్టర్ లత ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కాళిదాసు మాట్లా డుతూ బాలికలు తమ హక్కులను ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. అనంతరం జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి మాట్లాడారు. పొన్నూరు సిడిపిఒ వి.రమణ పాల్గొన్నారు.

## చేతుల పరిశుభ్రత దినోత్సవం

**ప్రజాశక్తి - దుగ్గిరాల :** ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉంటే రోగాల బారిన పడకుండా ఆరో గ్యవంతంగా ఉంటారని ఆర్డబ్ల్యూఎస్ ఈ ఈ త్రినాధబాబు అన్నారు.బుధవారం స్థానిక నిమ్మగడ్డ ఫౌండేషన్ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. అక్టోబర్ 15వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాన్ని పాఠశాలలకు సెలవులు రావ డంతో బుధవారం నిర్వహించారు.

# అభివృద్ధి, సంక్షేమంపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై, వైద్యసేవలను వినియోగించుకుంటున్నారని, ఇదే స్ఫూర్తితో అన్ని ప్రాంతాల్లో క్యాంపులు ముగిసే వరకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి కలెక్టర్, జెసి జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సురక్ష క్యాంపులకు సంబంధించి అధికారులకు సూచనలు చేశారు. విద్యా శాఖలో గ్రాస్ ఎన్‌రోల్‌ఎంట్ రేషియో నూరు శాతం ఉండేలా, డ్రాప్ ఔట్స్ లేకుండా పాఠ శాలల్లో చేర్పించాలన్నారు. గత విద్యా సంవంత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణత కాని విద్యార్థులందరి చేత పరీక్ష ఫీజులు కట్టించాలన్నారు. జిల్లాలోని ప్రతి క్లస్టర్‌లో జిఇఆర్ కు సంబంధించి నూరు శాతం ఎడ్యుకేషన్ సర్వే వివరాలు యాప్‌లో అప్లోడ్ చేసేలా యంపీడీఓ లు విద్యాశాఖాధికారులను సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు.

జగనన్నకు చెబుదాం అర్జీలను దరఖాస్తు దారు లు సంతృప్తి చెందేలా మెరుగైన పరిష్కారం అందించేలా జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్య వేక్షించాలన్నారు గ్రామ వార్డు సచివాలయ సేవలు , పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, రెవిన్యూకు సం బంధించిన అంశాలను మండలాల వారీగా సమీక్షించి సూచనలు అందించారు. కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, డియం అండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రావణ బాబు, డిఇఓ శైలజ, పంచాయతీ రాజ్ ఎస్.ఇ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

# వ్యవసాయేతర భూమిగా మార్చితే రుసుం

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని వివిధ గ్రామాల రైతులు వ్యవసాయ భూమిని, వ్యవసాయేతర భూమిగా మార్పు చేసుకొనేందుకు అధీకృత అధికారి తెనాలి సబ్ కలెక్టర్ ద్వారా, నిర్దేశించిన భూమి విలువలో ప్రభుత్వ ఖజానాకి చెల్లించాల్సిన 5 శాతం రుసుము చెల్లించి మార్పు చేసుకునేందుకు అవకాశం ఉందని చేబ్రోలు తహశీల్దార్ కె వి గోపాలకృష్ణ తెలిపారు. వ్యవసాయేతర భూములుగా మార్పు చేసుకొనుటకు అర్జీలను నిర్దేశించిన విధముగా గ్రామ/వార్డు సచివాలయములు ( లేదా) మీ సేవ కేంద్రాల్లో అర్జీలు దాఖలు చేసుకోవాలని తెలిపారు. అనంతరం అర్జీలను తహశీల్దారు నుండి ప్రతిపాదనలు తెనాలి సబ్ కలెక్టర్ కి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల రైతులు సుమారు 2019 తర్వాత వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చుకున్న వారు ప్రభుత్వ ఖజానాకు రుసుము చెల్లించి కూడా అర్జీలు ఇంకా ఆన్లైన్లో పెండింగ్‌లో ఉన్నట్లు చూపిస్తున్నాయని, అలాంటి అర్జీదారుల జాబితాను కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచినట్లు తెలిపారు. ఆన్లైన్లో పెండింగ్ లో ఉండి, జాబితాలో పేర్లు ఉన్న అర్జీదారులు వారి అధీకృత అధికారి నుండి పొందిన అనుమతి ఉత్తర్వులు, భూమికి సంబంధించి రిజిస్టర్డ్ దస్తావేజు నకళ్ళను తహశీల్దార్ కార్యాలయం పని దినాల్లో సమర్పించాలని తెలిపారు. ఒకవేళ అర్జీ దాఖలు పరచి కూడా ఉత్తర్వులు పొందనట్లయితే, అలాంటి రైతులు వారి వద్ద ఉన్న ఆధారాలు సమర్పిస్తే ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపుతామని పేర్కొన్నారు.

# 'గోరుముద్ద'లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

### ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఖాసిం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం మన్నవ, చింతలపూడి గ్రామాల్లోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి. ఖాసిం బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల ఎఫ్.ఏ-2 పరీక్ష పత్రాలు, విద్యార్థుల ప్రగతి పత్రాలను పరిశీలించారు. మన్నవ మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ప్రతి ఒక్క విద్యార్థికి ప్రత్యేకంగా ఒక ప్రగతి రికార్డును ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు విద్యార్థి అభివృద్ధిని నమోదు చేయడం అభినందనీయమని ఉపాధ్యాయులు నసీమా బేగం, రిజ్వానా సుల్తానాలను ప్రత్యేకంగా అభినందించారు. చింతలపూడి మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు,ఎఫ్.ఏ-2 పరీక్ష పత్రాలను పరిశీలించి, పరీక్షలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎఫ్.ఏ -2 పరీక్ష మార్కులను ఆన్లైన్లో వెంటనే పొందుపరచాలని, పాఠశాల రికార్డులను పక్కాగా నిర్వహించాలని, గోరుముద్ద ఆహార పదార్థాల నాణ్యతలో రాజీ పడకుండా మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలని ఆదేశించారు.

## కెఎల్‌యు పూర్వ విద్యార్థిని జ్యోతి సురేఖకు సత్కారం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్‌యు పూర్వ విద్యార్థిని, ఆర్చరీ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖను బుధవారం కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంత రావు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైనాలో ఇటీవల ముగిసిన ఆసియా క్రీడలు 2023 విలు విద్యలో మూడు బంగారు పతకాలను గెలుచుకుని అద్భుతమైన విజయాన్ని సాధించిందని అన్నారు. కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఆమె సిఇసి తో పాటు ఎంబిఎ కూడా పూర్తి చేసిందని అన్నారు. జ్యోతి సురేఖ తమ వర్శిటీ పూర్వ విద్యార్థిగా ఉండడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. కెఎల్ వర్శిటీలో చదువుతున్న పలువురు క్రీడా కారులకు తాము ఉచిత విద్యనందించడంతో పాటు పలు రకాల ఉపకార వేతనాలను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. వడ్డేశ్వరంలోని గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్ లోని విద్యర్థులందరూ జ్యోతి సురేఖను కలిసి కరచాలనం చేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సిఇసి విభాగాధిపతి డాక్టర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

జ్యోతి సురేఖను అభినందిస్తున్న డీన్ డాక్టర్ హనుమంత రావు, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ తదితరులు

## కుంచనపల్లిలో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంపి పరిధిలోని కెఎల్‌యు రోడ్డులో విద్యుత్ లైన్లు మరమ్మత్తుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ మంగళగిరి ఎగ్జిక్యూటివ్ డిప్యూటీ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కుంచన పల్లిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, ఈ విషయాన్ని గ్రామస్తులు గమనించాలని కోరారు.

## ప్రశాంతంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కాకుమాను

మండల పరిధిలో అన్ని గ్రామాలలో జగనన్న సురక్ష విజయవంతంగా కొనసాగుతోందని జడ్పీటిసి గుల్జార్ బేగం తెలిపారు. బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ రాముని శ్రీనివాసరావు మాట్లాడుతూ కాకుమాను గ్రామానికి వచ్చే ఇరువైపులా రోడ్లు సరిగా లేవని అన్నారు. రోడ్ల మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి కి సూచించారు. వైస్ ఎంపిపి కపిల్ దేవ్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వాలంటరీలు మండల పరిధిలోని సచివాలయాలను మండల కమిటీ వారు ఆకస్మికంగా సందర్శించడం జరుగుతుందని, విధుల్లో సక్రమంగా లేని వారికి నోటీసులు ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పరమేశ్వరరావు, ఎంపీడీవో రామకృష్ణ,వివిధ సచివాలయాల కన్వీనర్లు ఎన్ సుబ్బారావు,ఎస్.సుభాయ్య సుబ్బయ్య పాల్గొన్నారు.

## ఆకుముడత నివారణకు పిచికారి

ప్రజాశక్తి-తెనాలి

వరిలో సోకుతున్న ఆకుముడత, నాము తెగులుకు సకాలంలో పిచికారి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ చెప్పారు. రూరల్ గ్రామం మల్లెపాడులో బుధవారం పొలంబడి నిర్వహించారు. వరి పొలాలను పరిశీలించారు. అక్కడక్కడ నాము తెగులును గుర్తించారు. దాని నివారణకు ఉపయోగించాల్సిన మం దులు, పిచికారి చేసుకోవాల్సిన విదానాన్ని రైతులకు వివరించారు. కారర్యక్రమంలో విఏఏ లక్ష్మి, రైతులు స్టీవెన్‌బాబు పాల్గొన్నారు.

## టిజెపియస్ కళాశాలలో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపియస్ కళాశాలలో బుధవారం శంకర నేత్ర వైద్యశాల వారి నేతృత్వంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా నేత్ర వైద్య శిబిరం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎబి పి మనోహర్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం మాట్లా డుతూ నేత్రాలను సరిగా పట్టించుకోకపోవడం వలన చాలా ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మొబైల్ చూడటం వలన, రాత్రులు ఎక్కువగా మేల్కొనడం, సరైన ఆహారం తీసుకోకపోవడం వంటి కారణంగా నేత్రాలు అనారోగ్యం బారిన పడ టానికి అవకాశాలు ఉంటాయని అన్నారు. 500 మంది విద్యార్థులు 80 మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. వాసవి విద్యానిధి కమిటీ అధ్యక్షులు పొట్టి సుబ్రహ్మణ్యం,వైస్ ప్రిన్సిపాల్. భాను మురళి, గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం నిర్వహణ అధికారి డాక్టర్ జెవి సుధీర్‌కుమార్, మేజర్ పి.కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు..

## ఎస్ఆర్ఎం ప్రొఫెసర్లకు అరుదైన గుర్తింపు

**ప్రపంచంలోని రెండు శాతం ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎంపిక**

**అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ వెల్లడి**

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయానికి చెందిన ఐదుగురు ప్రొఫెసర్లకు ప్రపంచ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించిందని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్కుమార్ అరోరా బుధవారం తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పై వరుసలో ఉన్న రెండు శాతం ఉత్తమ శాస్త్ర వేత్తలుగా వీరు ఎంపికయ్యారని, అమెరికాలోని స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ ఇటీవల జరిపిన శాస్త్రవేత్తల డేటా విశ్లేషణ ప్రక్రియ ద్వారా రెండు శాతం ఉత్తమ శాస్త్రవేత్తల ర్యాంకులను ప్రకటించిందన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్, డాక్టర్ రంగభాష్యం సెల్లసెంబియన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రణధీర్ కుమార్, డాక్టర్ క్షీర సాగర్ సాహు, డాక్టర్ దివ్వా చతుర్వేదిలు టాప్ టు ర్యాంకింగ్ జాబితాలో స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 20 కేటగిరిల్లో పబ్లికేషన్స్ డేటాను విశ్లేషించిన స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ అంతర్జాతీయంగా ఉన్న ప్రొఫెసర్ల రీసెర్చ్ వర్క్, పబ్లికేషన్స్, సైటేషన్స్ వంటి కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులను కేటాయించారని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 2.10 లక్షల మంది ప్రొఫెసర్ల ప్రచురణలను పరిశీలించిన మీదట ర్యాంకులను కేటాయించిన స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ 2023 సంవత్సరానికి గాను భారత్ లో 4,635 మందిని రెండు శాతం ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎంపిక చేసింది. వీరిలో ఎపి నుండి ఎస్ఆర్ఎం ప్రొఫెసర్లు ఐదుగురున్నారని తెలిపారు. ఐదుగురు శాస్త్రవేత్తలకు ఛాన్సలర్ డాక్టర్ పి సత్యనారాయణన్ అభినందనలు తెలిపారు.

## కళ్లం ఇంజినీరింగ్ కాలేజీలో ఆరోగ్య పరీక్షలు

పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

**ప్రజాశక్తి-గుంటూరు :** కళ్లం ఇంజినీరింగ్ కాలేజీ లో అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా బుధ వారం విద్యార్థులు, అధ్యాపకులకు ఆరోగ్య పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు కొనాక్ డయాగ్నస్టిక్ ఇన్‌చార్జి టిడి సాయిబాబా, టెక్నికల్ బృందం ఆధ్వర్యంలో బిపి, షుగర్, థైరాయిడ్, బిఎంఐ పరీక్షలు నిర్వహించారు. కార్య క్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ అసోసియేట్ ప్రొఫెసర్ దోరశిల శ్రీనివాసులురెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎల్.మాధవరావు, ఫిజికల్ డైరెక్టర్ పి.పున్నారెడ్డి పాల్గొన్నారు.

## కెఎల్‌పి స్కూల్లో స్టాంపులు, నాణేల ప్రదర్శన

**ప్రజాశక్తి-గుంటూరు**

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో బుధవారం జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా స్టాంపులు, నాణాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ముఖ్య అతిథిగా పోస్టల్ సూపరింటె ండెంట్ యల్లమందయ్య, ఫిలాటరీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సెక్రెటరీ ఎం.ప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ స్టాంపుల సేకరణ విద్యార్థులను నూతన ప్రపంచంలోకి తీసుకెళుతుందని, తద్వారా అనేక విషయాలు తెలుసుకోవచ్చని అన్నారు. యల్లమందయ్య మాట్లాడుతూ స్టాంపుల సేకరణ అనేది కింగ్ ఆఫ్ హాబిట్ అని తెలియజేస్తూ, స్టాంపుల వల్ల విద్యార్థులలో విజ్ఞానం, చరిత్ర, భౌగోళిక విషయాలు, అనేక దేశాల గొప్పదనం అవగతం అవుతుందన్నారు. ఎం.ప్రసాద్ మాట్లాడుతూ తపాలా సంస్థ ప్రజలకు చేసే సేవలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. స్టాంపుల సేకరణ ఒక సృజనాత్మక కళ అని తెలిపారు. ఈ సందర్భంగా రధినిచౌదరి మాట్లాడుతూ తపాలా కార్యాలయాలు ప్రజలకు అందించే సేవల గురించి వివరించారు. ఈ ప్రదర్శనలో వివిధ దేశాలకు చెందిన స్టాంపులు ప్రదర్శించారు.

## మంగళగిరి స్టేడియం వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు

**రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు**

**కలెక్టర్‌ను కలిసిన ఎసిఎ కార్యదర్శి ఎస్.ఆర్. గోపినాథ్‌రెడ్డి**

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద రక్షణ కోసం పోలీస్ పికెట్ వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ యం.వేణు గోపాల్‌రెడ్డి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఆర్. గోపినాథ్‌రెడ్డికి హామీ ఇచ్చారు. మంగళగిరి, మూలపాడులో గురువారం నుంచి జరగనున్న అంతర్ రాష్ట్ర అండర్ 19 పురుషుల క్రికెట్ టోర్నీని దష్టిలో ఉంచుకొని అపెక్స్ కౌన్సిల్ మెంబర్లు, స్టేడియం సిబ్బందితో ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్. గోపీనాథ్‌రెడ్డి ఇటీవల సమావేశమై చేపట్టాల్సిన అభివద్ధి పనులు, తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలు వెంటనే పరిష్క రించడంలో భాగంగా ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనా థ్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డి.రమేష్ కుమార్ బుధవారం గుంటూరు జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ మంగళగిరి నుంచి స్టేడియంకు వెళ్లే దారిలో రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు రోడ్లు ఇతర మౌలిక వసతులు కల్పించే విషయమై ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు.

# బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

**అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో వక్తలు**

**ప్రజాశక్తి-గుంటూరు**

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, తదితరులు

అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్క రించుకొని జిల్లా స్త్రీ, శిశు అభివద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ ప్రోహిబిషన్ అఫ్ చైల్డ్ మ్యారేజ్ రూల్స్- 2023, అండర్ చైల్డ్ మ్యారేజ్ ప్రోహిబిషన్ యాక్ట్-2006 అంశపై మహిళా పోలీసులకు ఒకరోజు శిక్షణా శిబిరం నిర్వహిం చారు. ఆర్డీఒ ప్రభాకర రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఆరోగ్య ప్రమీల, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రాన్సిస్ తంబి, బాలల పరిరక్షణాధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాలి గిరి ధరరావు పాల్గొని జిల్లాను బాల్యవివాహ రహిత జిల్లాగా రూపొందించాలని కోరారు. ఆర్డీఒ ప్రభాకర్‌రెడ్డి మహిళా సంరక్షణ కార్యదర్శులతో ప్రతి గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేయిం చారు. అనంతరం ప్రముఖ ఉద్యమకారులు, సుప్రీం కోర్టు న్యాయవాది భువన్‌రిభు చైల్డ్ మ్యారేజెస్ ఇన్ ఇండియా అనే పుస్తకాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిబిజి పార్థసారధి ఆవిష్కరించారు. ఈ పుస్తకం గురించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వివరిస్తూ 2030 నాటికి బాల్య వివాహ రహిత దేశంగా భారతదేశాన్ని ఏ విధంగా తీర్చిదిద్దాలో చాలా వివరణాత్మకంగా ఈ పుస్తకంలో ఉందని, బాల్య వివాహ నిషేధ చట్టం అమలు చేయటంలో ఉన్న లోటుపాటుల గురించి వివరించారన్నారు. భారతదేశంలో ప్రతి నిమిషానికి మూడు బాల్య వివాహాలు జరుగుతున్నాయని, ప్రపంచంలో జరిగే బాల్య వివాహాలలో 1/3 వంతు భారతదేశంలోనే జరుగుతున్నాయి అని, వీటిని 2025 నాటికి కనీసం 10 శాతం తగ్గించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రోహిబిషన్ అఫ్ చైల్డ్ మ్యారేజ్ రూల్స్-2023 అండర్ చైల్డ్ మ్యారేజ్ ప్రోహిబిషన్ యాక్ట్-2006 అంశంపై డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ మధుసూదనరావు వివరించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి బి.మనోరంజని, సిడిపివోలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగము సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐకమత్యంతోనే యుజిసి పెన్షనర్ల సమస్యల పరిష్కారం

## ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

**ప్రజాశక్తి-గుంటూరు**

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యారంగంలో మూడున్నర దశాబ్దాలకుపైగా సేవలందించిన అధ్యాపకులు పదవీ విరమణ అనంతరం తమకు రావాల్సిన పెన్షన్, ఇతర అలవెన్స్ కోసం సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. బుధవారం స్థానిక బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో 'యునైటెడ్ యుజిసి పెన్షనర్స్ అసోసియేషన్' ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత ఉపాధ్యాయ అధ్యాపక ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎం.జె.మాణిక్యరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 2004 సంవత్సరం తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం గౌరవంగా, హక్కుగా పొందే పెన్షన్‌ను రద్దు చేసి, రకరకాల స్కీముల పేరుతో ఉద్యోగుల నడ్డి విరిచే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడారు. జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రాజగోపాల్ మాట్లాడుతూ విశ్రాంత యూజీసీ ఉద్యోగులు ఈ కేవైసీ ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతినెల పింఛను, ఇతర అలవెన్సులు పొందవచ్చునని తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించిన యునైటెడ్ యుజిసి పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ప్రొఫెసర్ వెన్నిశెట్టి సింగారావు మాట్లాడుతూ యుజిసి పెన్షనర్స్ అసోసియేషన్ రాజకీయాలకతీతంగా తమ సమస్యలపై సంఘటితంగా ఐకమత్యంతో కషి చేస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.విజయకుమార్, కార్యదర్శి డాక్టర్ మంచాల బోసుబాబు, సహాయ కార్యదర్శులు డాక్టర్ జి.సుధాకర్, కె.ఉపాధ్యాయ మహిళా ప్రతినిధి డాక్టర్ వై.భానుభవాని, కోశాధికారి డాక్టర్ సిహెచ్.శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

## తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో పైథాన్ ప్రోగ్రాంపై అవగాహన

**ప్రజాశక్తి- పల్నాడు జిల్లా**

ప్రొఫెసర్ జి.ఉదయ్ కిరణ్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి. నారాయణ

ప్రస్తుతం పైథాన్ డెవల పర్లకు, ఈ లాంగ్వేజీ గురించి బాగా తెలిసిన ప్రెషర్‌లకు కూడా సాఫ్ట్‌వేర్ రంగంలో ఎంతో ప్రాధా న్యత ఉందని టర్నింగ్ టెక్నోక్రాఫ్ట్స్ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.ఉదయ్ కిరణ్ అన్నారు. టర్నింగ్ టెక్నో క్రాఫ్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో జొన్నలగడ్డ గ్రామ పరిధిలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నుండి 3 రోజుల పాటు జరిగిన పైథాన్ ప్రోగ్రామింగ్ సదస్సు బుధవారం తో ముగిసింది. ఈసందర్భంగా సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణ లకు రూపకల్పనలు చేయాలన్నారు. తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ మాట్లాడుతూ పైథాన్ ప్రోగ్రామింగ్ వాణిజ్య పరంగా వినియోగించవచ్చన్నారు. పైథాన్ ప్రోగ్రామింగ్ ను మనసు పెట్టి నేర్చుకుంటే సులభంగా అర్థమవుతుందన్నారు. బహుళ జాతి కంపెనీలలో కొలువులు సాధిస్తా రన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు త్వరితగతిన ఉపాధి అవకా శాలు దక్కించుకుని జీవితంలో స్థిర పడేలా చేయాలనే లక్ష్యంగా తమ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ అన్నారు.

## గుంటూరు వైద్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన 13 వ జాతీయ వైద్య విద్యార్థుల సదస్సు ఉస్మె కాన్-23 గుంటూరు మెడికల్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చారు. సెప్టెంబర్ 29వ తేదీ నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు జరిగిన ఈ సదస్సు లో జాతీయ స్థాయిలో వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఎముకలు కీళ్ళ విభాగం మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ అద్దేపల్లి శ్రీనివాస్ పర్యవేక్షణలో గుంటూరు మెడికల్ కళాశాల నాలుగో, మూడో సంవత్సర యం బి బి ఎస్ విద్యార్థులు రెండో బహుమతి సాధించుకున్నారు. ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ కుక్క కాటుకు గురైన బాధితునికి ఎడమ చేయి నరం పడి పోవడంతో శస్త్ర చికిత్స చేసి కోలుకునే విధంగా యం బి బి ఎస్ విద్యార్థులు మూడో యూనిట్ డాక్టర్ అద్దేపల్లి శ్రీనివాస్ నేతత్వంలో విద్యార్థులు ప్రతిభ ను చాటారని ఆయన అన్నారు. రెండు నెలల క్రితం చేసిన ఆపరేషన్‌కు ఈ బహుమతి రావడం అభినందనీయమని ఆయన చెప్పారు. ఇలాంటి అరుదైన కేసులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి కె దక్కిందని ఆయన చెప్పారు. కార్యక్రమం లో డాక్టర్ అద్దేపల్లి శ్రీనివాస్, యం బి బి ఎస్ విద్యార్థులు అయేషా సిద్దిక్, ముస్కాన్ బేగం లు ఉన్నారు.